


# గుప్పెడు మనసు

— జె.యస్.కె.వి.

గుమ్మంలో నిలబడి భర్త కోసం ఎదురు చూస్తోంది తులసి. భర్త తన కోరిక తీరుస్తాడా? లేదా? ఆమె మనసు డోలాయమానంగా ఉంది.

పెళ్లయిన ఆరు నెలలకి మొదటిసారి కోరింది గనక తీరుస్తాడని.

పొద్దున్న అతని మాటల తీరును బట్టి తీర్చడని

ఇవి కేవలం ఊహాలు. అతనువస్తేగాని ఏది నిజమయ్యేదీ, అతనికి తన మీద ఎంత ప్రేమ ఉన్నదీ తెలీదు!'' ఈ ఆలోచనతో తులసికి మనసు ఒక చోట ఒక పనిపై నిలవడం లేదు. భర్త ఎప్పుడొస్తాడా అని ఒకటే ఆరాటం!

మామూలుగా అతను వచ్చేటప్పటికి ఆరుదాటుతుంది. అది తెలిసినా అయిదు గంటల నుంచే అలా గుమ్మం దగ్గరికి వెళ్లటం, ఆశగా వీధి చివరి వరకూ కాసేపు చూసి, నిట్టూరుస్తూ ఇంట్లోకి నడవడం మళ్లీ ఆరాటంగా గుమ్మం దగ్గరికి చేరటంతో ఆమెకు ఎన్నడూ లేనంత విసుగ్గా కాలం గడుస్తోంది.

ఆఖరికి తులసి నిరీక్షణ ఫలించింది!

వీధి చివర అచ్యుతరావు కన్పించాడు.

భర్తను చూడగానే సంతోషంగా ఆమె కళ్లు మెరిశాయి.

అంతలోనే ఆమె భృకుటి ముడిపడింది.

వీధిలో నడుస్తున్న అచ్యుతరావు గుమ్మంలో భార్యను చూడగానే గ్రహించాడు అలా నిలబడడం అలవాటులేని భార్య అక్కడ వుందంటే.. ఆమె మనసు అర్థమైంది. తన అశక్తతను ఓ క్షణం నిందించుకున్నాడు.

కాని, ఏం చేయగలడు?

గుమ్మం దగ్గరికి చేరుకోగానే తులసిని చూసి నవ్వబోయిన అచ్యుతరావు ప్రయత్నం విఫలమైంది— ఆమె ముఖంలోని భావాల వల్ల!

నేను కోరిన చీర తేలేదేం? అని తులసి ప్రశ్నించలేదు.

'సారీ! తేలేకపోయాను'' అంటూ అచ్యుతరావు సంజాయిషీ ఇచ్చుకోలేదు.

ఇద్దరూ మౌనంగా లోపలికి నడిచారు.

అచ్యుతరావు బాత్‌రూంలో ముఖం కడుక్కుని వచ్చేటప్పటికి రోజులాగే కాఫీ కప్పు అందించింది. అయితే ఎప్పటిలా ఆమె అతని దగ్గరే కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లుచెప్పలేదు. తిరిగి వంటగదిలోకి వెళ్లిపోయింది.

భర్త పిలుస్తాడేమోనని ఎదురుచూసిన తులసికి నిరాశ తప్పలేదు.

''ఎప్పటికి మాట్లాడతాడో చూద్దాం'' అనుకుంది ఉక్రోషంగా.

''అర్థం చేసుకునేటట్టు ఆమెకు నచ్చచెప్పటమో, చీర కొనేందుకు వాయిదా అడగటమో మంచి భర్తగా తను చేయాల్సిన పని' అని అచ్యుతరావు తలచినా, ఆమె బెట్టు ఎంతసేపో చూడాలి! తను కల్పించుకోకుండా అలక ఎప్పుడు, ఎలా మానుతుందో చూస్తే సరి!' అని అనుకున్నాడు.

పేపరు తీసి, పొద్దున్న పట్టించుకోకుండా వదిలేసిన వార్తల్ని కూడా శ్రద్ధగా చదవసాగాడు అచ్యుతరావు.

కాఫీ తాగి, కాసేపు అలాగే కూర్చుని, ఏమీ తోచక వంటకు ఉపక్రమించింది తులసి. పేపరు పేజీలు తిరగేస్తున్న శబ్దాన్ని బట్టి భర్త తనగురించి విస్మరించాడని గ్రహించిందామె. ఆమెకు కన్నీళ్లొచ్చాయి.

హఠాత్తుగా విన్పించిన మాటల్ని బట్టి భర్త టీవీ చూస్తున్నాడని తులసి గ్రహించింది.

ఆమె మనసులో బాధ స్థానే కోపం చోటు చేసుకుంది.

విసురుగా ముందుగదిలోకి వెళ్లి ట్రాన్సిస్టర్ తెచ్చుకుని వివిధ భారతిలో పాటలు వినసాగింది. ఇంతలో తనకు నచ్చిన పాట రావడంతో వాల్యూం పెంచింది.

ఆ పాట అయిపోయినా వాల్యూం తగ్గించలేదు తులసి. ఒంటరిగా టీవీ చూస్తున్నాడు కదూ! ఇలాగే బుద్ధి చెప్పాలి!' అనుకుంది.

వంట ముగిసి, భోంచేసే వేళ అయ్యింది. భర్తను భోజనానికి ఎలా పిలవాలో అర్థం కాలేదు తులసికి. ఆత్మాభిమానం కోల్పోకుండా ఈ మౌన పోరాటం ముగిసేదెలా?'' అన్నదే ఇప్పుడు ఆమె సమస్యగా భావిస్తోంది.

కాసేపు ఆలోచించి కంచంలో అన్నం, కూరా పెట్టి మిగతావి గిన్నెల్లో సర్ది, తీసుకెళ్లి భర్త టీపాయ్ మీద ఉంచింది.

ఆవేళ్టి మార్పు గమనించిన అచ్యుతరావు భార్యకేసి చిరునవ్వుతో చూస్తూ నువ్వు కూడా తెచ్చుకో.. టీవీలో చక్కటి ప్రోగ్రామ్ వస్తోంది, చూడు. ఇక్కడే కూర్చుని తిందాం!'' అన్నాడు.

కాని, తులసి వంట గదిలో కూర్చునే భోం చేసింది.

డబుల్ కాట్ మీద పడుకున్నాక భర్త తనకు చేరువవుతాడని ఆశించింది తులసి. అతను తాకితే విదిలించుకోవాలని కూడా అనుకుంది. కానీ, అచ్యుతరావు అలాంటి ప్రయత్నమేమీ చేయలేదు.

తను మెత్తబడటాన్ని మరోలా అర్థం చేసుకునిఇంకా మొండికేస్తే? అని తర్జన భర్జన పడుతున్నాడతను. తులసి ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

నిన్న పక్కింటి రమ కొత్త చీర చూపుతూ, కొత్తగా తెరిచిన ప్రియా షోరూమ్‌లో కొన్నాను.. అన్నట్లు భానుప్రియ మోడలింగ్ చేసిన సరితా ఫ్యాబ్రిక్స్ చీర— నీకు బాగా నచ్చిందంటూ పత్రికలో వచ్చిన ఫోటో చూపావే! ఆ చీర కూడా ఉంది షాపులో అని చెప్పింది.

ఆమె వెళ్లిపోగానే, ఏదేమైనా భర్తకు చెప్పి చీరను కొనిపించుకోవాలనుకుంది.

భర్త ఆఫీసునుంచి త్వరగా రావటం చూసి సంతోషించింది.

కానీ అతను ''తలనొప్పితో తల బద్దలయ్యేలా ఉంది. పర్మిషన్ తీసుకుని వచ్చేశాను'' అన్నాడు.

అతని నుదుటికి అమృతాంజనం రాసి, కాఫీ చేసి ఇచ్చింది.

ఓ గంటసేపటికి అతని తలనొప్పి తగ్గింది గాని తను చీర గురించి మరిచిపోయింది.

పొద్దున్న అతను భోం చేస్తున్నప్పుడు నాకో చీర కొనరూ?'' అంది.

''చీరా?'' అన్నాడు.

''అవును'' అంటూ రెడీగా పట్టుకున్న ప్రకటన చూపించింది.

''ఇదే చీర కావాలి. నాకెంతో నచ్చి ఈ కటింగ్ దాచాను. ప్రియా షోరూంలో రమ చూసిందట. సాయంత్రం ఆఫీసునుంచివచ్చేటప్పుడు కొనుక్కురండి'' గడగడా చెప్పేసింది.

భర్త కాసేపు మాట్లాడలేదు.

''ఇప్పుడు అవసరంలేకుండా ఇలాంటి ఖర్చులెందుకు చెప్పు. నాకే బాధ్యతలూ లేకపోతే డబ్బు బాగానే మిగిలేది. కాని తమ్ముడి చదువు, చెల్లెలి పెళ్లి గురించి నేనూ పట్టించుకోవాలిగా! అందుకై జీతంలో అయిదొందలు ఇంటికి పంపాల్సివస్తోంది. మరో నాలుగు నెలల్లో నాజీతం పెరుగుతుందని చెప్పాను కదా. అప్పుడు నువ్వు ఇలాంటి చిన్న కోరికలు ఎన్నయినా తీర్చుకోవచ్చు. ఏమంటావ్?' అన్నాడు నచ్చచెబుతున్నట్లు...

ఆఫీసుకి వెళ్లే ముందు తన వాలకం గమనించినట్టు భుజాలపై చేతులేసి, ''నేను చెప్పింది నచ్చలేదా?'' అన్నాడు.

అప్పటికి ఏం మాట్లాడాలో ఆలోచించుకున్న తను ''చిన్న కోరిక అని మీరే అన్నారు. ఈ ఒక్కటీ తీర్చటానికేం? ఇంత వరకూ ఏమైనా అడిగానా?''

అతను నవ్వేసి వెళ్లిపోయాడు.

తన మాటల ప్రభావంతో మనసు మార్చుకుని చీర తెస్తాడని ఎదురుచూసింది గానీ ఏం లాభం?

అలా ఆలోచిస్తూ తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంది తులసి.

మర్నాడు.

పొద్దున్న నిద్రలేచాక కూడా భార్యా భర్తల మధ్య మాటలు కరువయ్యాయి.

బ్రెష్ చేసుకున్నాక కాఫీ చేసేందుకని స్టవ్ దగ్గరికెళ్లిన తులసి గత రాత్రి జరిగినది గుర్తొచ్చి ఆ ప్రయత్నం విరమించుకుంది.

అతను బాత్‌రూం కెళ్లి బ్రెష్ చేసుకుని వచ్చి పేపరు చదువుతుంటే కాఫీ తీసుకెళ్లి టీపాయ్ మీద పెట్టింది. అతను అందుకుని భార్యను పలకరించకుండానే పేపరు చూస్తూ, కాఫీ తాగసాగాడు.

అచ్యుతరావు ఆఫీసుకెళ్లేవరకూ అలా భార్యాభర్తలమధ్య మాటలు లేకుండానే గడిచింది.

భర్త వెళ్లాక దిగాలుగా కూర్చుండిపోయింది తులసి.

'చీర కోరి తప్పచేశానేమో' అనుకుందామె. కోరినా అతను వీలుకాదని వివరంగా చెప్పినప్పుడు అర్థం చేసుకోవలసింది.

తను మామూలుగానే వుంటే అతనేం చెప్పేవాడో? అనవసరంగా మాటలు తెగేటట్లు చేసింది.. పుట్టింట్లో ఒక్కొక్కప్పుడు కనీసావసరాలకి కూడా ఇబ్బందిపడాల్సివచ్చేది. కాని, కాపురానికి వచ్చాక దేనికీ లోటు లేకుండానే కాలం గడిచిపోతుంది. పెళ్లికి ముందు అతనికి సిగరెట్లు అలవాటుండేది. తనొచ్చాక కూడా ఓ నెల రోజులు కాల్చాడు. తర్వాత ఖర్చులను దృష్టిలో ఉంచుకుని సిగరెట్లకి స్వస్తి చెప్పాడేగాని, తనిచ్చినదే ఇంటి ఖర్చులని సరిపెట్టాలని చెప్పలేదు. ఇలాంటివన్నీ గుర్తొచ్చిన తులసికి భర్త మంచితనం అర్థమైంది.

పని మనిషి వచ్చేవరకూ తులసి ఆలోచనలు పరిపరి విధాల సాగుతూనే ఉన్నాయి.

పెరట్లో అంట్ల దగ్గర కూర్చుని తోమటం మొదలుపెడుతూ, ఈ చీర ఎన్ని కుట్లేసినా పెగిలిపోతోందమ్మా. మీ పాత చీరొకటివ్వండమ్మా. మీకు పనికిరాని చీరేదిచ్చినా చాలు'' అంది పని మనిషి.

అలాగే అని లోపలికొచ్చింది తులసి.

రెండుమూడు చోట్ల చిరిగిన చీరలు రెండున్నాయి. కుట్టుకుని వాడుకుంటుంది అవిచ్చేదామా అనుకుంది ముందు. కానీ, అందుకు మనసొప్పలేదు. చిరుగుపడని చీరనే ఇద్దామని ఓ చీర తీసి ఉంచింది.

పనిమనిషి వెళ్తున్నప్పుడు ఆ చీర చేతిలో పెట్టింది

చీర చూసి ఆమె మురిసిపోయి, ''కొత్తదిలా ఉందమ్మా'' అంది.

ఏమంత పాతబడలేదు గాని, కొని చాలా రోజులే అయ్యిందిలే తీసుకో'' అంది తులసి.

సంబరంగా చీరను చేత్తో తడిమి చూసుకుంటూ వెళ్లిపోయిందామె.

ఆమె వెళ్లిపోయాక ఆమె ముఖంలో మెరిసిన సంతృప్తే గుర్తుండిపోయింది తులసికి.

* *** *

ఆ సాయంత్రం

అచ్యుతరావు ఆఫీసునుంచి వస్తూ వస్తూ కొత్త చీర కొని తెచ్చాడు.

ముభావంగా అందుకుంది తులసి.

పడగ్గదిలో రాత్రి కొత్త చీరలో దర్శనమిస్తుందనుకున్న తులసిని పాత నేతచీరలో చూసి విస్తుబోయాడు అచ్యుతరావు.

ఇదేమిటి... కొత్త చీర కట్టుకోలేదే అని అడుగుదామనుకుంటున్నంతలోనే.. అచ్యుతరావుని తమకంగా అల్లుకుపోతూ పాత చీరలో నేను బావుంటాను కదూ!'' అంది తులసి అతని చెవిలో గుస గుసగా.

''పజిల్'లో పడ్డాడు అచ్యుతరావు.

తులసి మాత్రం అదేం పట్టనట్లు పని మనిషి ముఖంలో మెరిసిన 'తృప్తి'ని మరోసారి గుర్తు చేసుకుని మరీ అచ్యుతరావుని మరింత గాఢంగా అల్లుకుపోయింది.

* *** *

సరిగ్గా నాలుగు రోజుల తర్వాత అచ్యుతరావు ఆఫీసు కెళ్తున్నప్పుడు తులసి మరో 'కోరిక' కోరింది.

అప్పుడు మాత్రం ఆమె పనిమనిషిని గుర్తుకు తెచ్చుకోలేదు!